# అన్నన్నా జున్ను!

"ఏమండీ! ఎక్కడున్నారు. రెండోసారి నాకు కాఫీ యివ్వలేదేం!" అంది బుజ బుజ రేకుల బుజ్జమ్మ.

"ఇదిగో యిస్తున్నాను. కాఫీ ఎక్కువ సార్లు తాగితే గ్యాస్ పెరుగుతుందని, మొన్ననే తెలుసుకున్నాను" అన్నాడు, బుజ్జమ్మ మొగుడు.

"మీకు అక్కర్లేని విషయాలన్నీ కావాలి! కావలసినవి అక్కర్లేదు" అంది, ఓ పెద్దతత్త్వవేత్తలా.

చిన్నప్పట్నుంచీ బుజ్జమ్మని చాలా గారాభంగా పెంచారు తల్లిదండ్రులు.! అయిదో ఏటి నుంచే కాఫీ కావలసినన్ని సార్లు పట్టించేవారు. కాఫీ ఆలస్యమైతే అలుకతో కాఫీతాగనానేది. "ఇక పైన ఆలస్యం అవదులేరా నాన్నా! ఈ ఒక్కసారికి తాగెయ్" అంటూ బుజ్జమ్మని బుజ్జగించి కాఫీ తాగించేవారు. 'బుజ్జమ్మ' బారసాలనాడు పెట్టిన పేరు కాదు. తల్లిదండ్రులు ఈ పిల్లని పలువూర్లు బుజ్జగించడం చూసి యిరుగుపొరుగువారు, మురిసిపోయి, ముచ్చటపడి 'బుజ్జమ్మ' అని ప్రేమగా పిలిచేవారు. అలా ఈ పేరే ఖాయమైపోయింది.

"ఆ ఇదిగో! కాఫీ తెచ్చాను. చల్లారిపోకుండా తాగెయ్" అన్నాడు బుజ్జమ్మ మొగుడు కాఫీగ్లాసు అందిస్తూ.

"వెర్రిమొగుడు నేనంటే ప్రేమ వుంది. ఇంట్లోనూ ఆఫీసులోనూ పన్లు చెయ్యలేక సతమతమైపోతున్నాడు పిచ్చిమానవుడు" అనుకుంది బుజ్జమ్మ.

పనులన్నీ చేసుకుని, ఇక ఆఫీస్‌కి బయల్దేరదామనుకుంటున్న సమయంలో, తను పురమాయించిన జున్నుపాలు తేలేదన్న విషయం జ్ఞాపకం వచ్చి అగ్గిమీద గుగ్గిలం అయిపోయింది బుజ్జమ్మ.

"ఆ జున్నుపాలు ఏం చేశారు?" అంది బిగ్గరగా.

"ఏ జున్నుపాలు?" "అంటే నేను చెప్పినది తేకపోగా ఏ జున్నుపాలని నన్నే అడుగుతారా!"

"ఓ! మా ఆఫీసులో యిద్దరు ముగ్గురికి చెప్పాను. ఇంకా కొన్ని గేదెలు ఈనవలసినవి ఈనలేదని చెప్పారు".

"అయితే వెళ్ళిరండి"

ఆఫీస్‌కి వెళ్ళగానే, ఆఫీసర్ 'బొజ్జయ్య' ఓ మూడుసార్లు పిలిచాడని చెప్పారు తన సహోద్యోగులు.

"ఏం సార్ పిలిచారట!"

"ఏమిటి! ఆ మాట్లాడే విధానం! ఆఫీసర్‌తో ఎలా మాట్లాడాలో తెలుసుకో! వారం రోజుల క్రితం చెప్పాను. ఆ పని యింకా చెయ్యలేదు"

"సారీ సర్! నా చేతుల్లో ఏముంది సార్! గేదెలు ఇంకా ఈనలేదు. ఈనిన వెంటనే జున్ను పాలు తీసుకొస్తాను" అన్నాడు. ఆఫీస్‌కి వచ్చేటప్పుడు బుజ్జమ్మ చెప్పిన జున్నుపాల విషయమే తన గుండెల్లో కదలాడుతున్న బుజ్జమ్మ మొగుడు.

"నాన్సెన్స్" ఆఫీసులో గేదెలు గురించి మాట్లాడతావేంటి! ఓ నువ్ వెటర్నీ డిపార్టుమెంట్ నుంచి ఖాళీగా వున్న ఉద్యోగాల సర్దుబాటులో వచ్చావ్ కదూ! అది సరే! జున్ను పాలు దొరికితే నాకు కూడా ఓ రెండు లీటర్లు తీసుకురా!"

"సరే అయితే మొత్తం నాలుగు లీటర్లు సంపాదించాలన్న మాట" అన్నాడు.

"రెండు చాలోయ్!బుజ్జమ్మకి రెండు మీకు రెండూ సార్"

"బుజ్జమ్మ ఎవరోయ్! మీ పని మనిషా"

"బాగుంది వరస! పెళ్ళానికి కావలసిన జున్ను పాలు దొరకక నేనేడుస్తూంటే, మధ్యలో పనిమనిషి ఒకర్తా!" స్వగతంగా అనుకుంటూ, "బుజ్జమ్మ అంటే నా భార్యసార్, పనిమనిషి కాదు. నా చేత పని చేయించే మనిషి"

"అంటే మీ అత్తారిది ఏ ఊరు"

"దువ్వండి"

"మీ అత్తారి ఊరు పేరు చెప్పడానికి నేను నిన్ను దువ్వాలా!"

"అది కాదండీ మా అత్తారి ఊరి పేరు 'దువ్వ' "

"అరే! అయితే మీ మామగారి పేరు దూర్వాసుడా"

"అవును సార్"

"అయితే నువ్ బుజ బుజరేకుల బుజ్జమ్మ మొగుడివా!"

"చిన్నప్పుడు మా అమమ్మగారి యింటికి వచ్చినప్పుడు అస్తమానం దాన్ని ఎత్తుకు తిప్పేవాడ్ని! అస్తమానం "అవ్వాయి తువ్వాయా" అంటూ పరిగెడుతూండేది."

"హర్నీ! నా పెళ్ళాన్ని చిన్నప్పుడు ఎత్తుకు తిప్పుతూ, గారం చేసి పాడుచేసిన వాళ్ళల్లో నువ్వొకడివి అన్నమాట. హరి చిట్టి తండ్రీ! నువ్ చేసిన సహాయానికి, నీకు జున్నుపాలు తేవలసిందే!" అనుకున్నాడు, బుజ్జమ్మ మొగుడు.

"సరే వెళ్ళు! నీ పెళ్ళాం నాకు చిన్నప్పట్నుంచీ తెలుసుకదానని ఆఫీసు పని సరిగ్గా చెయ్యకపోయావో, నా సంగతి తెలుసుకదా" అన్నాడు బొజ్జయ్య.

"తెలుసుసార్! మీ పెద్ద బొజ్జతో నన్ను నొక్కేసి చంపేస్తారు అని స్వగతంగా అనుకుంటూ "నేనంటు వాడ్ని కాదుసార్" అన్నాడు.

"సరే! వెళ్ళి పని చూసుకో"

"ఏమిటో ఈ బొజ్జయ్యగారు నన్ను ఏమీ తెలియని వెర్రి వెధవ ననుకుంటున్నాడు.

అసలు ఈయనకి ఆ బొజ్జయ్య పేరు వాళ్ళ తల్లిదండ్రులు ఎందుకు పెట్టారో కూడా నాకు తెలుసు వరుసగా మగ పిల్లలు పుట్టిపోతూంటే ఏదో ఒక పిచ్చి పేరు పెడితే బొజ్జయ్య దీర్ఘాయుష్మంతుడవుతాడని ఈ పేరు పెట్టారు. ఈ పిచ్చిపేరు వలన ఈయన తల్లిదండ్రులు అనుకున్నట్లే బ్రతికాడు. పైగా ఓ పెద్ద బొజ్జ పెంచుకుని సార్థక నామధేయుడయ్యాడు." అనుకున్నాడు బుజ్జమ్మ మొగుడు.

సాయంకాలం ఆఫీస్ నుంచి వెళ్ళిపోతూ, 'రేపు ఆదివారం నీ భార్య బుజ్జమ్మని తీసుకుని మా యింటికి భోజనానికి రావోయ్! ఈ విషయం ఆఫీసులో ఎవరికీ తెలియనివ్వకు. వాళ్ళందర్నీ పిలవలేదని ఏడుస్తారు" అని ఆహ్వానించాడు బుజ్జమ్మ మొగుడ్ని.

"ఈ విషయాలన్నీ బుజ్జమ్మకి చెపుతే, యింట్లో ఎగిరి గంతు లేస్తుంది సార్"

"అదే అయితే చిన్నప్పటిలాగే యిప్పటికీ, బుజ్జమ్మ గంతులేస్తోంది అన్నమాట! అలా చిలిపిగా వుండే వాళ్ళంటే నాకు వల్ల మాలిన అభిమానమోయ్".

'మరి ఆఫీసులో కొంచెం చిలిపిగా వుంటే ఎందుకు సహించరో నాకర్థం కావటం లేదు'

"ఏమిటి ఆలోచిస్తున్నావ్!" ఏం లేదు సార్. అందరూ నాకు గంతులేసే పెళ్ళాం వుందని నన్ను అదృష్టవంతుడు అంటారు. కానీ ఆ గంతులు లెక్కపెట్టలేక ఛస్తున్నాను సార్!"

"నీ దగ్గర మంచి సెన్స్ ఆఫ్ హ్యూమరుందోయ్.!

సాయంకాలం యింటికి వస్తూనే, "బుజ్జమ్మా! నీకొక శుభవార్త! ఓ రెండ్రోజుల్లో నీకు జున్నుపాలు తెచ్చేస్తా"

"అంత ఖచ్చితంగా ఎలా చెపుతున్నారు"

"చిన్నప్పుడు నిన్నెత్తుకు తిప్పిన ఓ బొజ్జగాడే మా ఆఫీసర్"

"బొజ్జవున్న వాళ్ళెవరూ నన్ను ఎత్తుకు తిప్పలేదే నా చిన్నప్పుడు"

"బొజ్జ తర్వాత డెవలప్ చేసుకుని వుంటాడులే. ఆయనకి కూడా ఓ రెండు లీటర్ల జున్నుపాలు కావాలట. నేను పొరపాటుని జున్నుపాల సందర్భంలో 'బుజ్జమ్మ' అన్నాను అంతే! నువ్ బుజ బుజ రేకుల బుజ్జమ్మ మొగుడివా' అంటూ మురిసిపోయాడు"

"అదేనండీ నా గొప్పతనం. శ్రీకృష్ణుని పేరు చెపితే గోపికలు మురిసిపోయినట్లు, బుజ్జమ్మ అనగానే ఆ బాలగోపాలం పరవశించి పోతారు".

"రేపు ఆదివారం, వాళ్ళింటికి భోజనానికి రమ్మనాడు నిన్ను తీసుకుని. పన్లోపని ఓ రెండు లీటర్ల జున్ను పాలు తీసుకొస్తాను. జున్ను వండి తీసుకెడదాం! ఆదివారమంతా తింటాడు పాపం" అన్నాడు.

ఆదివారం బొజ్జయ్య యింటికి సతీసమేతంగా జున్నుతో సహా భోజనానికి వెళ్ళారు.

వాళ్ళని చూస్తూనే "బుజ్జమ్మా! నా బుజ బుజ రేకుల బుజ్జమ్మా!" ఇలా వచ్చి ఈ సోఫాలో నా పక్కనన కూర్చోవే" అన్నాడు బొజ్జయ్య.

శ్రీమతి బొజ్జయ్య వాళ్ళు పక్క పక్కన కూర్చోవడం సహించ లేకపోయింది. "బుజ్జమ్మా! యిలా లోపలికి వచ్చి మా ఇల్లు చూడు" అంటూ బుజ్జమ్మని లోపలికి తీసుకు వెళ్లింది శ్రీమతి బొజ్జయ్య.

చిన్నప్పుడు బుజ్జమ్మ చేసిన చిలిపి పనులు గురించి ముచ్చటిస్తూ, మురిసిపోయాడు బొజ్జయ్య.

భోజనాలయిపోయాయ్! బొజ్జయ్యని లోపలికి పిలిచి, "పరాయి ఆడది కనిపిస్తే చాలు పరవశించిపోతారు! కొంచెం మనోనిగ్రహం వుండాలి. చిన్నప్పుడు బుజ్జమ్మ బుజ బుజరేకులదయి వుండవచ్చు. చిన్నప్పుడు అందరూ బొద్దుగా ముద్దుగానే వుంటారు! పెళ్ళయిన ఆడదానితో హద్దుల్లో లేకుండా అస్తమానం 'అదీ', 'యిదీ' అంటూ ఏకవచన ప్రయోగం చేస్తే ఏం మర్యాదగా వుంటుంది చెప్పండి."

మీరు హాల్లోకెళ్ళి "నేను పిలుస్తున్నానని బుజ్జమ్మని లోపలికి పంపించండి. ఓ చీరా జాకెట్టు పెడతాను. తర్వాత వాళ్ళని సాగనంపుదాం!" అంది శ్రీమతి బొజ్జయ్య, సాంప్రదాయ సిద్ధంగా.

బుజ్జమ్మ పతీసమేతంగా సెలవు తీసుకుని ఇంటికి వచ్చేసింది.

"అయ్యా శ్రీవారూ!" ఈ జున్ను ఎక్కువగా వుందని ఒకేసారి తినెయ్యకండి. జున్ను వాతం చేస్తుంది. మిరియాలు కూడా వేసినట్లు లేదు. మీరు చూస్తే ఫ్రీగా వస్తే ఫినాయిల్ తాగే రకం" అంది శ్రీమతి బొజ్జమ్మ.

జున్ను అంటే మహాయిష్టం బొజ్జయ్యకి. తనకున్న బొజ్జలో సగభాగం, జున్నుతిని పెంచినదే. ఇంచుమించుగా రాత్రి నిద్రపోకుండా, గంట గంటకీ జున్ను ఊదేశాడు బొజ్జయ్య.

బొజ్జయ్యకి వాతం కమ్ముకు వచ్చేసింది. పెద్ద హాస్పిటల్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో పడుకోపెట్టారు బొజ్జయ్యని.

బొజ్జయ్యగారి భార్యా, బుజ్జమ్మ చెరో రెండు లీటర్ల పాలు జున్ను వండి ఈశ్వరుడికి నైవేద్యం పెడతామని మొక్కుకున్నారు.

బొజ్జయ్య బ్రతికి బట్టకట్టాడు. ఆ యిద్దరు పడతులూ ఒకేసారి మొత్తం నాలుగు లీటర్ల జున్నూ ఈశ్వరుడికి నైవేద్యం పెట్టారు.

"మానవులు జ్ఞానహీనులు. జున్నువాతం చేస్తుందని తెలిసికూడా, ఒకేసారి నాలుగు లీటర్ల జున్ను నైవేద్యం పెట్టారు చూడండి" అంది శివానీ శివుడితో.

(ఆంధ్రభూమి వారపత్రిక 18-10-2012)